


టెండర్లు పూర్తయ్యేదెన్నడో?

లక్ష్మి కాలువపై లిఫ్ట్‌ల నిర్వహణకు అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
39.0 /19.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లక్ష్యాన్ని దాటిన విద్యుదుత్పత్తి



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జల విద్యుదుత్పత్తి కేంద్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024- 25)లో విధించిన 62 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని శనివారం అధిగమించింది. ప్రాజెక్ట్ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌లు ఉండగా, ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగా వాట్ల చొప్పున రోజుకు 36 మెగావాట్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ప్రతి టర్బయిన్‌కు 2,200 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. విద్యుదుత్పత్తి ప్రారంభం కావాలంటే కాకతీయ కాలువ ద్వారా కనీసం వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టాలి. లక్ష్యాన్ని అధిగమించడంపై జెన్‌కో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రస్తుతం మూడు టర్బయిన్‌ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది.

ఎగ్జామినేషన్ సెంటర్ల వద్ద బీఎన్‌ఎస్ 163

ఖలీల్‌వాడి : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 141 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటి సమీపంలోని జిరాక్స్ సెంటర్లతోపాటు వంద మీటర్ల దూరం వరకు ఉన్న దుకాణ సముదాయాలను మూసి ఉంచాలని ఆదేశించారు. సెంటర్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ఏఐ



బోధన్ : ప్రాథమిక విద్యలో విద్యా ప్రమాణాల పెంపునకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - కృతిమ మేధ) బోధనను జిల్లాలోని 44 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. పట్టణంలోని శక్కర్‌నగర్ మధుమలాంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఐ బోధనను (ఎఫ్ఎల్ఎన్ - ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమాన్ని డీఈవో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉండి కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో రాయడం, చదవడం, సంఖ్యాపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడం, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చడం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏఐని పాఠశాలల్లో ప్రవేశ పెట్టిందన్నారు. పాఠశాలల్లో కంప్యూటర్లు, హెడ్ ఫోన్స్, ఇంటర్నెట్ సదుపాయం, ఇతర అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మధుమలాంచ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకుంటున్న 197 మంది విద్యార్థులకు ఏఐ విద్యను అందించేందుకు 10 కంప్యూటర్లను సిద్ధం చేశామన్నారు. ఎంఈవో నాగయ్య, కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం ఆరిఫ్, హెచ్‌ఎం నరేందర్, సాయికిరణ్, ఉపాధ్యాయులు ప్రీతి, శివతేజ, సాగర్, శ్రీకాంత్, సీఆర్‌పీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్పల్లిలో ట్యాంకర్ ద్వారా నీటిని పారిస్తున్న దృశ్యం


కర్నల్ తండా శివారులో బోరు బావి తవ్వకం


కర్నల్ తండాలోని ఎండిన పొలంలో మేస్తున్న పశువులు

ఆశల సాగు ఆవిరయ్యే..

నీరందక ఎండిపోతున్న పంటలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- లక్షల్లో అప్పులు చేసి బోరుబావుల తవ్వకం
- జీవాల మేతగా ఎండిన పంటలు

ధర్పల్లి : రైతులు ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి పైర్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పొట్ట దశకు వచ్చిన వందల ఎకరాల్లో వరి పొలాలు బీటలువారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వానాకాలంలో భారీ వర్షాలు కురవడంతో కుంటలు, చెరువులు నిండాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి బోర్లు బాగా పోశాయి. దీంతో పంటలు పండుతాయనే నమ్మకంతో యాసంగిలో కూడా రైతులు ఎక్కువగా వరి సాగు చేశారు. కానీ, ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోవడంతో పొట్ట దశలో ఉన్న పంట ఎండిపోతోంది. బోర్లను నమ్ముకొని వరి వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అప్పులే మిగిలాయి



ఈ రైతు పేరు మహిపాల్. ధర్పల్లి మండలం కర్నల్ తండా. యాసంగిలో మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పొట్ట దశకు వచ్చాక బోరు ఎత్తిపోయింది. దీంతో రూ. 1.20 లక్షలు వెచ్చించి 800 అడుగుల బోరు బావి తవ్వించాడు. కొద్దిపాటి నీరు బయటకు రాగా పంటకు సరిపోతాయనే ఆశతో మరో రూ.1.40 లక్షలతో కొత్త పైపులు, కేబుల్‌తో మోటారు బిగించాడు. కానీ ఆ రైతు ఆశలు కొన్ని రోజుల్లోనే ఆవిరయ్యాయి. కొత్తగా తవ్వించిన బోరు నుంచి నీరు రాకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక పంటలో పశువులను మేపుతున్నాడు.


ధర్పల్లిలో పొట్ట దశలో ఎండిపోయిన వరి పంట

భగీరథ ప్రయత్నాలు

జిల్లాలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ ప్రాంతాల్లో బోరుబావులన్నీ ఎత్తిపోవడంతో పొట్ట దశకు వచ్చిన వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, నీరున్న చోటి నుంచి కిలో మీటర్ల మేర పైప్‌లైన్లు వేసి కొద్దిపాటి పంటనైనా రక్షించుకునేందుకు యత్నిస్తున్నారు. మరికొందరు రైతులు అప్పులు తెచ్చి బోర్లు వేస్తున్నా చుక్క నీరు రాక కన్నీరు మున్నీరవుతున్నారు. చేసేదేమీ లేక ఎండిన మడుల్లో పశువులను మేపుతున్నారు.

ట్యాంకర్‌తో నీరు పెడుతున్న..



మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. మరో 20 రోజుల్లో పంటచేతికి వస్తుంది. కానీ, ఇదే టైంల బోర్లు అడుగంటాయి. రెండు ఎకరాల పొలాన్ని వదులుకున్న. ఒక ఎకరం పంటనైనా కాపాడుకునేందుకు వేరే చోట నుంచి ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్న.

– చెలిమెల మహేశ్, రైతు, ధర్పల్లి

బోర్లు ఎత్తిపోయాయి



రెండు ఎకరాల్లో పొలం వేశా. రెండు బోర్లు ఉన్నాయి. గత సంవత్సరం యాసంగిలో ఇబ్బందిపడలేదు. అదే ఆశతో ఈయాసంగిలోనూ వరి సాగు చేశా. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ల ద్వారా పారకం నిలిచి పోయింది. చివరకు రెండు ఎకరాల పంటను వదులుకున్నాను.

– నల్ల సంతోష్ రెడ్డి, రైతు, ధర్పల్లి

నాటి అల్లకొండ..

నేటి బాల్కొండ

- అల్లయ్య, కొండయ్య అనే మల్లయోధులు నిర్మించిన పట్టణం
- 1059లో మూడంచెల వ్యవస్థతో ఖిల్లా నిర్మాణం
- 1102లో ఢిల్లీ సుల్తానుల ఆక్రమణతో ధ్వంసం.. తరువాత పునర్నిర్మాణం చేసిన కాకతీయులు


అల్లయ్య, కొండయ్య విగ్రహాలు


రుద్రమ దేవి విగ్రహం


ఖిల్లా ప్రధాన ముఖ ద్వారం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బాల్కొండ పట్టణానికి ప్రపంచానికి చాటి చెప్పేలా గొప్ప ప్రాచీన చరిత్ర ఉంది. బాల్కొండకు చెందిన అల్లయ్య, కొండయ్య అనే మల్లయోధులు 1059లో ఇక్కడ కొండపై భారీ ఖిల్లాను నిర్మించారు. రాష్ట్ర పురావస్తు శాఖ వివరాల మేరకు ఖిల్లా లోపలి భాగంలో 39 ఎకరాల 27 గుంటల విస్తీర్ణం ఉంది. అప్పట్లో దీనిని అల్లకొండ కోట అనేవారు. ఈ కోట కొండలతో చుట్టుముట్టినట్లుగా ఉండేది. అప్పట్లో ఈ అల్లకొండ నగరాన్ని శ్రీ సోమ, ఆర్య, సూర్య క్షత్రియులు పరిపాలించారు. మూడు అంచెల వ్యవస్థతో అల్లకొండ రాజ్యాన్ని కాపాడారు. ఖిల్లా గుట్ట కింద లోపలి భాగంలో అంతర్గత రాజమహల్ నిర్మించారు. ఇక్కడ ఉన్న బావికి అత్తాకోడళ్ల బావి అని పేరు. ఈ బావిలో ఒక వైపు మంచినీరు, మరోవైపు ఉప్పు నీరు ఉండటం విశేషం. ఆ రోజుల్లో ఒకే బావిలో ఇలా రెండు రకాల నీరు లభించినట్లు విశేషంగా చెప్పుకునేవారు. శత్రువుల చొరబాటు నిరోధించేందుకు గాను కోటకు ఆరు సింహ ద్వారాలు(కమాన్లు), దీన్ని ఆనుకుని పట్టణం, చుట్టాలోతైన 'కందకాలు' నిర్మించారు. వీటికి అనుసంధానంగా ఆయా సింహద్వారాల అడుగు భాగంలో నాగపడగ ఆకారంలో ఇప్పటికీ గుర్తులు ఉన్నాయి.

సండే స్పెషల్

■ ఘనచరిత్ర కలిగిన అల్లకొండ ఖిల్లాపై 1101లో ఢిల్లీ సుల్తాన్ అయిన అలంగీర్‌పాషా సోదరుడైన జాఫర్ ముఖురబ్ ఖాన్ 5 వేల మంది సిపాయిలతో దండెత్తి ఓటమి చెందాడు. ఓటమి సహించలేక మళ్లీ రెండోసారి 1102లో 5 వేల అశ్వకదళాలు, వెయ్యి ఏనుగులు, 7 వేల మంది సిపాయిలతో దండెత్తి అల్లయ్య, కొండయ్యలను హతమార్చి కోటను ఆక్రమించుకున్నారు. దీంతో ఖిల్లా ఢిల్లీ పాలకుల చేతిలోకి వెళ్లింది.

■ ఢిల్లీ పాలకుల అనంతరం అల్లకొండ కోట కాకతీయుల పాలనలోకి వెళ్లింది. గణపతిదేవుడు ఈ ఖిల్లాను తిరిగి నిర్మించినట్లు చరిత్రకారుడు బీఆర్ నర్సింగ్‌రావు తెలిపారు. ఇప్పటికీ ఈ ఖిల్లా నిర్మాణాలపై కాకతీయ పాలకుడైన గణపతిదేవుడు వేసిన శాసనాలు ఉన్నాయి. ఇలాంటి పురాతన కట్టడాల వారసత్వ సంపద కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని నర్సింగ్‌రావు కోరుతున్నారు. నర్సింగ్‌రావు 2014 నుంచి 2020 వరకు ఈ ఖిల్లా గురించి రీసెర్చ్ చేశారు.


ఖిల్లాపై పూజలందుకుంటున్న శివలింగం


ఖిల్లాలో పూర్వ కాలం నాటి ఆనవాళ్లు

భారత జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ భారత జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి తైవాన్ దేశంలో జరుగనున్న ఏషియన్ సబ్ జూనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరఫున వారు పాల్గొననున్నారు. అంతకుముందు ఈనెల 15నుంచి 20 వరకు న్యూఢిల్లీలో జరిగే మూడవ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిలో జిల్లా క్రీడాకారులు బి నిశిత, జి వర్షిని, డి కీర్తన (సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్ధపల్లి), ఆర్ సౌజన్య (సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ఆర్మూర్)ఉన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్, సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినోద్ అభినందించారు.

మిగిలింది పక్షం రోజులే..

వంద శాతం పన్ను వసూలయ్యేనా?
- ఇప్పటి వరకు వసూలైంది 81.56 శాతమే..
- 94 గ్రామాల్లో వందశాతం పూర్తి
- వసూళ్లలో ప్రథమ స్థానంలో చందూర్ మండలం.. చివరి స్థానంలో రెంజల్


శ్రీనగర్ జీపీలో పన్ను వసూళ్ల రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు (ఫైల్)

మోపాల్: జిల్లాలోని 545 గ్రామపంచాయతీల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లకు మరో పక్షం రోజులు మాత్రమే మిగిలి ఉంది. 15 రోజుల్లో 18.44 శాతం ఇంటి, కుళాయి పన్ను వసూలు చేయాల్సి ఉంది. జిల్లాలో రూ.26.90 కోట్ల డిమాండ్ ఉండగా, ఇప్పటివరకు రూ. 21.94 కోట్లు (81.56 శాతం) వసూలైంది. కాగా ఈనెల 25 లోగానే వందశాతం లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లా పంచాయతీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. గతేడాది 97 శాతం వరకు వసూలు కాగా, ఈసారి అంతకన్నా తక్కువ శాతం నమోదయ్యేలా ఉంది. 15 రోజుల్లో సుమారు రూ.5 కోట్లకుపైనే పన్ను వసూలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం పథకాల అమలు కోసం ఇటీవల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో పలు సర్వేలు, కులగణన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ మందగించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు జీపీ ఖాతాల్లో జమ కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

నెల రోజులుగా..

వందశాతం పన్ను వసూలైన 94 గ్రామాలు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నెలరోజులుగా పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లపై దృష్టి సారించారు. వందశాతం పూర్తయిన గ్రామాల కార్యదర్శులు ఇతర గ్రామాల కార్యదర్శులకు సహకరిస్తున్నారు. అన్ని గ్రామాల్లో వందశాతం పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికితోడు 12 నెలలుగా జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. అప్పులు చేసి గ్రామాల్లో చిన్న, చిన్న పనులు చేపడుతున్నారు. జిల్లాలో పన్ను వసూళ్లలో 88.39 శాతంతో చందూర్ మండలం మొదటిస్థానంలో ఉండగా, 76.43 శాతంతో రెంజల్ చివరిస్థానంలో ఉంది.

వంద శాతం పూర్తి చేస్తాం

జిల్లాలో ఇంటిపన్ను వసూలు ప్రక్రియను వేగవంతం చేశాం. లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. నెల రోజుల వ్యవధిలో 30 శాతానికిపైగా వసూలు చేశాం. ఇటీవల ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించాం. ఎట్టి పరిస్థితుల్లో ఈనెల 25లోగా లక్ష్యం మేరకు పన్ను వసూలు చేయాలని ఆదేశాలిచ్చాం. – శ్రీనివాస్‌రావు, డీపీవో

ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం
- మాస్‌కాపీయింగ్‌కు తావుండదు..
- ఒకవేళ జరిగితే పరీక్షల అధికారులను బాధ్యులను చేస్తాం
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- హాల్‌టికెట్లపై తప్పులుంటే ఆందోళన చెందొద్దు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్

క్యూఆర్ కోడ్‌తో ఆన్సర్ బుక్‌లెట్‌లు


నిజామాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈసారి ఆన్సర్ షీట్లకు బదులు 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు 24 పేజీల ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో ఉండే బుక్‌లెట్ అందిస్తామని, అలాగే ఫిజికల్ సైన్స్, బయోలజికల్ సైన్స్‌కు 12 చొప్పున పేజీలుండే బుక్‌లెట్‌లను ఇస్తామన్నారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహిస్తామని, హాల్ టికెట్లపై తప్పులుంటే విద్యార్థులు ఆందోళన చెందొద్దని సూచించిన డీఈవోతో పరీక్షల నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

✤ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారా?

■ 141 సెంటర్లలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించాం. విద్యార్థులు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి.

✤ ప్రైవేట్ పాఠశాలలకు ఎక్కువ సెంటర్లు ఇచ్చారనే విమర్శలపై..

■ అలాంటిదేమీ లేదు మౌలిక సదుపాయాలు దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉన్న, సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్న స్కూళ్లను సెంటర్ల కోసం ఎంపిక చేశాం. ఒక ప్రాంతాన్ని తీసుకొని ఆ ప్రాంతంలోని విద్యార్థులందరికీ సౌకర్యంగా ఉండే పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేశాం. అయినా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ సెంటర్లు ఉన్నాయి. సెంటర్ ఏదైనా పూర్తి స్థాయి నిఘా జిల్లా విద్యాశాఖదే ఉంటుంది. ప్రైవేట్ వారికి ఎలాంటి అధికారం కూడా ఉండదు.



✤ మాస్‌కాపీయింగ్ నిరోధానికి తీసుకుంటున్న చర్యలు..?

■ ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుంది. ఇప్పటికే పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఉండే సెంటర్లలో ముందస్తు చర్యలు చేపట్టాం.

✤ కొత్త నిబంధనలు ఏమైనా ఉన్నాయా..?

■ ఈ ఏడాది కేవలం ఆరు పేపర్లతో పరీక్షలు ఉంటాయి. కొత్తగా నిబంధనలు ఏమీ లేవు. కేవలం పేపర్ల సంఖ్య మాత్రమే తగ్గింది. విద్యార్థులు సజావుగా పరీక్షలు రాయొచ్చు.

✤ హాల్ టికెట్లపై తప్పులుంటే..?

■ హాల్ టికెట్లపై తప్పులున్నా విద్యార్థులు ఆందోళన చెందొద్దు. పరీక్ష రాసేందుకు అనుమతిస్తాం. సెంటర్‌లో ఉండే చీఫ్ సూపరింటెండెట్లు, డిపార్ట్‌మెంట్‌ల్ ఆఫీసర్లు పరిశీలిస్తారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలకు సమాచారం ఇచ్చి వివరాలు తెలుసుకొని విద్యార్థులను అనుమతిస్తారు. ఇప్పటికే చాలా మంది తమ హాల్‌టికెట్లను సరిచూసుకున్నారు.

✤ గ్రామీణ ప్రాంతాల్లోని సెంటర్లలో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఉందనే ఆరోపణలపై..

■ పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అని తేడా లేకుండా జిల్లాలోని 141 సెంటర్లలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. ఏ సెంటర్‌లో మాస్‌కాపీయింగ్ జరిగినా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంట్‌ఆఫీసర్లను బాధ్యులను చేస్తాం. మాస్‌కాపీయింగ్ నిరోధానికి ప్రత్యేక బృందాలున్నాయి ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారు. సీసీ కెమెరాలతో నిఘా కొనసాగుతోంది.

✤ సెంటర్లలో ఏర్పాట్లు..?

■ ఎగ్జామినేషన్ సెంటర్లలో తాగునీటి సదుపాయం, ఫ్యాన్లు, టేబుళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ వైద్య బృందాలు విధుల్లో ఉంటాయి. సెంటర్లలో ఎప్పటికప్పుడు శానిటేషన్ చేపడతారు.

మొత్తం విద్యార్థులు	:	22,915
బాలికలు	:	11,239
బాలురు	:	11,418
ప్రైవేట్/సప్లిమెంటరీ విద్యార్థులు	:	258
ఎగ్జామినేషన్ సెంటర్లు	:	141
చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు	:	141
ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు	:	06
సిట్టింగ్‌స్క్వాడ్‌లు	:	141
కంట్రోల్ రూం నంబర్	:	9030282993

పరీక్ష సమయం:
ఉదయం 9.30 నుంచి
మధ్యాహ్నం12.30 గంటల వరకు

జాతీయ సెమినార్‌లో ఇందూరు చరిత్ర పరిశోధకులు



సుభాష్‌నగర్: ఇతిహాస సంకలన సమితి తెలంగాణ ఆధ్వర్యంలో 'దక్షిణ పథ' పేరుతోహైదరాబాద్‌లోని ఐసీఎంలో శనివారం నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌కు ఇందూరు చరిత్ర పరిశోధకులు కందకుర్తి ఆనంద్, దావుల వివేకానంద హాజరయ్యారు. దక్షిణ భారతదేశ చరిత్ర పరిశోధకులు సెమినార్ ఏర్పాటు చేయగా, ఇందూరు ప్రాంతాన్ని పాలించిన రాజవంశాల గురించి కందకుర్తి ఆనంద్, ఇందూరు జిల్లా దేవాలయాల చరిత్రను దావుల వివేకానంద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్పించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కాగా, విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎల్వీ సుబ్రహ్మణ్యం, అరవింద్‌రావు, చరిత్ర పరిశోధకులు, పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: ప్రొఫెసర్‌ రాంరెడ్డి దూర విద్య కేంద్రంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ రాంమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు రెండో విడత అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99126 70252 సంప్రదించాలన్నారు.

ఉచిత డ్రైవింగ్‌ కోర్సుకు..

నిజామాబాద్‌అర్బన్‌: వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డ్రైవింగ్‌ కోర్సులలో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్‌లో హెచ్‌ఎంవీ, ఎల్‌ఎంవీ శిక్షణ కాలం 30రోజులు ఉంటుందన్నారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మినెంట్‌ లైసెన్స్‌ ఉచితంగా అందిస్తుందన్నారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజనం, వసతి హైదరాబాదులో కల్పించనున్నట్లు తెలిపారు. 18ఏళ్ల నుంచి 45ఏళ్లలోపు వారు అర్హులన్నారు. 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల బీసీ నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తులను ఈనెల 15నుంచి 31లోపు జిల్లా బీసీ వెనుకబడిన తరగతుల కార్యాలయంలో అందించాల.

కేసుల చార్జిషీట్‌పై సమీక్ష



కార్యక్రమంలో పాల్గొన్న పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు

ఖలీల్‌వాడి: నగరంలో శనివారం డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో కేసుల చార్జిషీట్‌పై సమీక్ష నిర్వహించారు. కొత్త చట్టాల ద్వారా లోక్‌ అదాలత్‌ కేసుల లొసుగుల గురించి సమీక్షించారు. లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. నూతన చట్టాల ద్వారా నేరపరిశోధన, చార్జిషీట్‌ దాఖలు చేసే విధానం గురించి, సాక్షుల వివరాలు సేకరించే విధానం గురించి వివరించారు. ప్రతి కేసులో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. జిల్లా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌గౌడ్‌, దామోదర్‌ రెడ్డి, కావేటి శేషు, బంటు వసంత్‌, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు జి. రామకృష్ణ, భూసారపు రాజేష్‌ గౌడ్‌, అశోక్‌ శివరాంనాయక్‌, చిదిరాల రాణి పాల్గొన్నారు.

ఏప్రిల్‌ 20 నుంచి 'ఓపెన్‌' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఏప్రిల్‌ 20 నుంచి 26 వరకు ఓపెన్‌ ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పరీక్షలు 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఇంటర్‌ ప్రాక్టికల్స్‌ ఏప్రిల్‌ 26నుంచి మే 3వరకు కొనసాగుతాయన్నారు.

ఎల్లారెడ్డిలో ఒకరి ఆత్మహత్య


ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన సిత్తరి బాలకృష్ణ (28)కు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పుల బాధ తాళలేక అతడు తిమ్మారెడ్డి శివారులోని రామలింగం బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడురు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన జొన్నల భూమయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో, దాడులు చేశారు. 45 మద్యం సీసాలు, మరో 34 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై స్రవంతి తెలిపారు. నిందితుడిని అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశామన్నారు.

టెండర్లు పూర్తయ్యేదెన్నడో?

- లక్ష్మి కాలువపై లిఫ్టుల నిర్వహణకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- అధికారులు టెండర్లు పిలిచినా ముందుకురాని కాంట్రాక్టర్లు



లక్ష్మి ఎత్తిపోతల పథకం

బాల్కొండ: కాలువల లిఫ్టుల నిర్వహణకు అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో టెండర్లు పూర్తయ్యేదెన్నడంటూ ఆయకట్టు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటి సరాఫరా చేసే లక్ష్మి కాలువపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలతోపాటు, లక్ష్మి ఎత్తిపోతల పథకం లిఫ్టుల నిర్వహణ కోసం నెలన్నర క్రితం ప్రభుత్వం రూ. 10కోట్ల 47లక్షల 40వేల నిధులను మంజూరు చేసింది. ఈక్రమంలో అధికారులు టెండర్లు పిలిచి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు ప్రక్రియ పూర్తి కాలేదు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని సమాచారం.

ఆందోళనలో రైతులు..

ప్రస్తుతం మరో నెల రోజుల్లో యాసంగి సీజన్‌కు నీటి విడుదలను నిలిపివేస్తారు. ఇప్పటికే టెండర్లు పూర్తయి సిద్ధంగా ఉంటే సకాలంలో పనులు ప్రారంభించి వచ్చే ఖరీఫ్‌ సీజన్‌ నాటికి ఎత్తిపోతలను సిద్ధంగా ఉంచవచ్చు. కానీ టెండర్లు ఆలస్యంగా పూర్తిచేస్తే నీటి విడుదలకు ఆటంకాలు ఏర్పడుతాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెంటనే టెండర్‌ ప్రక్రియ పూర్తిచేసి, పనులు పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

> **త్వరలో పూర్తిచేస్తాం..**
> ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్లను ఆహ్వానించినా ఇప్పటి వరకు పూర్తికాలేదు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి, ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం నాటికి లిఫ్టుల మెయింటెనెన్స్‌ పూర్తి చేస్తాం.
> –సురేశ్‌, డిప్యూటీఈఈ, మైనర్‌ ఇరిగేషన్‌, బాల్కొండ

నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు



ఖలీల్‌వాడి: నకిలీ గల్ఫ్‌ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని పోలీస్‌ కమిషనర్‌ పోతరాజు సాయిచైతన్య శనివారం ఒక ప్రకటనలో సూచించారు. గల్ఫ్‌లో ఉపాధి అవకాశాల పేరిట మాయమాటలు చెబుతూ చాలా మంది ఏజెంట్లు అనధికారికంగా చలామణి అవుతున్నారని, దీంతో అమాయకులు మోసపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు గల్ఫ్‌ ఏజెంట్లకు తమ ఇళ్లను అద్దెకు ఇవ్వొద్దని, ఒక వేళ ఇస్తే పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. అలాగే రద్దీ ప్రాంతాలు పార్కులు, ఐలాండ్‌, ప్రభుత్వ భవనాలు వంటి ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయొద్దని, విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్‌ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. 500 మందితో కూడిన సమావేశాలు, సభలకు ఏసీపీ అనుమతి తప్పనిసరి అని, రాత్రి 10 నుంచి ఉదయం 6గంటల వరకు డీజే సౌండ్‌ సిస్టంపై పూర్తి నిషేధం ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలు ఈనెల 16 నుంచి 31వరకు ఉంటాయన్నారు. డ్రోన్‌లతో జనజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లితుందని, ప్రభుత్వ సంస్థలు, పోలీసులు, ఏవియేషన్‌ అధికారుల నుంచి క్లియరెన్స్‌ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ రాజేష్‌ చంద్ర

కామారెడ్డి క్రైం: లైంగిక దాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కోర్టులో కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ 'భరోసా సెంటర్‌' అండగా నిలుస్తుందని ఎస్పీ రాజేష్‌ చంద్ర అన్నారు. కామారెడ్డి లోని వడ్లూర్‌ రోడ్డులో ఉన్న భరోసా సెంటర్‌ను ఎస్పీ శనివారం సందర్శించారు. అందుబాటులో ఉన్న లీగల్‌, మెడికల్‌, చిన్నారుల కౌన్సెలింగ్‌ గదులు, స్టేట్మెంట్‌ రికార్డు, సమావేశ గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధిత మహిళలకు వైద్య, సైకాలజీ, పోలీసులు సహకారం, పరిహారం ఇప్పించడం లాంటి సేవలు అందుతున్నాయని తెలిపారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు అందించాలని, అవసరం ఉన్న వారికి భరోసా సెంటర్‌లో ఆశ్రయం కల్పించాలని సిబ్బందికి సూచించారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా శనివారం ప్రాజెక్ట్‌ అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. వరద కాలువ ద్వారా ముందుగా 500 క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభించి క్రమంగా నీటి విడుదలను పెంచుతామన్నారు. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టు ద్వారా 540 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 405 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాల ద్వారా 312 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 384 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1071.00(25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

ఇంటర్‌ పరీక్షలకు 364 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లావ్యాప్తంగా ఇంటర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన సెకండియర్‌ పరీక్షలకు జిల్లాలో మొత్తం 14,472 మంది విద్యార్థులకు గాను 14,108 మంది విద్యార్థులు హాజరయ్యారు. 364 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 51 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశామని జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి రవి కుమార్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

చెరువులో మునిగి ఒకరి మృతి



సాయిలు(ఫైల్‌)

మాక్లూర్‌: మండలంలోని చిన్నాపూర్‌ చెరువు మొరం గుంతలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడిపోయి మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు ఇలా.. చిన్నాపూర్‌కు చెందిన గోగుల సాయిలు (30) శుక్రవారం హోలీ సందర్భంగా రంగులు ఆడి, స్నానం చేయడానికి సాయంత్రం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులోని మొరం గుంతలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించగా, వారు చెరువులో సాయిలు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడి భార్య గంగూబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని నర్సన్నపల్లి గ్రామానికి చెందిన రాసమొల్ల రాజశేఖర్‌ (27)కు తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన రమ్యతో రెండున్నరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి 16 నెలల వయస్సుగల కుమార్తె ఉంది. అతడు కామారెడ్డిలోని ఓ ప్రైవేటు షోరూంలో పని చేస్తున్నాడు. హోలీ రోజునే తన భార్యను తల్లిగారింటి వద్ద దింపి వచ్చాడు. ఆ తర్వాత అతడి ఫోన్‌ కలవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శనివారం రాజశేఖర్‌ మృతదేహం చిన్నమల్లారెడ్డి చెరువులో తేలింది. అతని మృతికి గల కారణాలు తెలియడం లేదు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడి భార్య రమ్య తన భర్త మరణంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో బాలిక అదృశ్యం



సోనమ్‌కౌర్‌(ఫైల్‌)

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి, రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడకు చెందిన మహేందర్‌ సింగ్‌ తన భార్య, నలుగురు పిల్లలతో కలిసి ఈ నెల 13న నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాందేడ్‌ వెళ్లడానికి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ రైలు ఎక్కారు. కొంతసేపటికి తన కూతురు సోనమ్‌కౌర్‌(4) కనిపించలేదని, రైలులో వెతికినా ఆచూకీ లభించలేదని మహేందర్‌సింగ్‌ తెలిపారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా బాలిక ఆచూకీ తెలిస్తే నిజామాబాద్‌ రైల్వే పోలీసులకు గాని, ఒకటో టౌన్‌ పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు.

కాలువలో పడి యువకుడి గల్లంతు



కాలువ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు



సిద్ధు (ఫైల్‌)

బాన్సువాడ రూరల్‌: మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా.. మండలంలోని సంగ్రాంతండాకు చెందిన బోడ సిద్ధు (సిద్దార్థ) అనే 19ఏళ్ల యువకుడు శనివారం మిత్రుడు రాజుతో కలిసి సేవాలాల్‌ దీక్ష చేపట్టడానికి కావాల్సిన షాపింగ్‌ కోసం బాన్సువాడ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పెద్దపూల్‌ బ్రిడ్జి వద్ద కాళ్ల చేతులు కడుక్కోవడానికి ఇరువురు కాలువలో దిగారు. ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రాజును స్థానికులు కాపాడారు. సిద్ధు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో కాలువలో గాలిస్తున్నారు.

పాముకాటుతో పదేళ్ల బాలుడి మృతి



ఒడ్డె శ్యామ్‌ (ఫైల్‌)

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని తొండాకూర్‌ గ్రామంలో ఓ బాలుడు పాముకాటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలో ఒడ్డె సునీత తన కొడుకు శ్యామ్‌(10)తో కలిసి ఓ అద్దె ఇంట్లో నివసిస్తోంది. బాలుడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సునీత కూలీపని చేసుకుంటూ బాలుడిని చూసుకుంటుంది. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం బాలుడు, తల్లి ఇంట్లో నిద్రించగా, నాగుపాము వచ్చి బాలుడి చెవి దగ్గర కాటు వేసింది. తల్లి గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పామును కర్రతో చంపేశారు. వెంటనే బాలుడిని నందిపేట్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. జిల్లా కేంద్రంలో రెండు మూడు ఆస్పత్రులు తిరిగినా వైద్యం చేసేందుకు వైద్యులు ముందుకు రాలేదు. ఆలస్యం కావడంతో బాలుడు మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లి రోదనలు మిన్నంటాయి.

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత



ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మీదుగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను బజరంగ్‌దళ్‌ నాయకులు శనివారం అడ్డుకున్నారు. నిజామాబాద్‌ జిల్లా సాటాపూర్‌ నుంచి రెండు లారీలలో పరిమితికి మించి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నారన్న సమాచారం బజరంగ్‌దళ్‌ సభ్యులకు తెలిసింది.దీంతో వారు ఆజామాబాద్‌ గేట్‌ వద్ద రెండు లారీలను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు.దీంతో పోలీసులు రెండు లారీలలో ఉన్న పశువులను బిచ్కుంద గోశాలకు తరలించారు.

8 టన్నుల రేషన్‌ బియ్యం పట్టివేత



రేషన్‌ బియ్యంతో టాస్క్‌ఫోర్స్‌ అధికారులు

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని పీడీఎస్‌ రైస్‌ గోదాంపై టాస్క్‌ఫోర్స్‌ అధికారులు శనివారం దాడులు నిర్వహించి 8 టన్నుల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జి ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య, సిబ్బంది పట్టణంలోని 3 గోదాముల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వచేసిన 8 టన్నుల రేషన్‌ బియ్యంను పట్టుకున్నారు. వీటి విలువ రూ. 2,80,000 వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మూడు గోదాముల యజమానులును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు



ఆర్‌ఎం జ్యోత్స్న

నిజామాబాద్‌-1డిపో	- 9154298727
నిజామాబాద్‌-2డిపో	- 7396889496
ఆర్‌ఎం ఆఫీసు	- 8639969647
ఆర్మూర్‌ డిపో	- 7396889496
బోధన్‌ డిపో	- 9676747174
బాన్సువాడ డిపో	- 9154298729
కామారెడ్డి డిపో	- 9154298729

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ప్రజలకు ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు అందించనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు.'శ్రీరామనవమి' సందర్భంగా ఏప్రిల్‌ 6న భద్రాచలంలో జరుగనున్న శ్రీ సీతా రాముల వారి కల్యాణంలో వాడిన తలంబ్రాలు, ముత్యాలు రాష్ట్ర ఆర్టీసీ కార్గో సేవా విభాగం ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఆర్టీసీ కార్గోలో శుక్రవారం నుంచి రూ.151 చెల్లించి బుక్‌ చేసుకోవాలన్నారు. వారికి తలంబ్రాలను హోమ్‌ డెలివరీ ద్వారా అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కింది ఫోన్‌ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాలి



సీపీ సాయి చైతన్యకు మొక్క అందజేస్తున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: నగరంలో చైన్‌ స్నాచింగ్‌, వాహనాల దొంగతనాలు, ఇళ్ల చోరీలను అరికట్టి, పోలీసులు ప్రజలకు రక్షణగా నిలవాలని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ విజ్ఞప్తిచేశారు. జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతున్న డ్రగ్స్‌, గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, యువతను వాటి బారిన పడకుండా కాపాడాలన్నారు. నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయి చైతన్యను శనివారం తన ఛాంబర్‌లో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీపీకి మొక్కను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో లా అండ్‌ ఆర్డర్‌ అదుపు చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో ట్రాఫిక్‌ సమస్య, ఫుట్‌పాత్‌ కబ్జాలు, అక్రమ భూకబ్జాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జిల్లా అభివృద్ధి, లా అండ్‌ ఆర్డర్‌ అదుపు చేయడంలో పోలీస్‌శాఖ తీసుకునే ప్రతి విషయంలో ఎమ్మెల్యేగా తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

సీపీని కలిసిన బోధన్‌ సబ్‌ కలెక్టర్‌



సీపీకి మొక్క అందజేస్తున్న సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో శనివారం నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్యను బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌ కలెక్టర్‌ను సీపీ స్వాగతిస్తూ అభినందించారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు

- భయం వీడి, బాగా రాసి, మంచి మార్కులు సాధించాలి
- విద్యార్థులకు మానసిక వైద్యుడు విశాల్‌ సూచనలు



ఆకుల విశాల్‌, మానసిక వైద్యుడు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రస్తుతం విద్యాసంస్థల్లో వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. త్వరలో పదోతరగతి పరీక్షలు సైతం ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా, భయం లేకుండా పరీక్షలు రాయాలని మానసిక వైద్యుడు, ఇండియన్‌ సైకియాట్రిక్‌ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశాల్‌ పేర్కొంటున్నారు. చాలా మంది విద్యార్థులు పరీక్షలు రాగానే భయపడుతుంటారు. కానీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే సులువుగా పరీక్షల్లో విజయం సాధించవచ్చు. అలాగే విద్యార్థులకు ఒక ప్రకటనలో పలు సలహాలు, సూచనలు చేశారు.

- పరీక్షలకు వెళ్లేముందు పరీక్ష విధానం గురించి స్పష్టంగా తెలుసుకోవాలి. టీచర్స్‌ చెప్పిన మెళకువలు గుర్తుచేసుకోవాలి.
- ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారు. వాటికి జవాబులు ఎలా రాయాలి, ఎంత రాయాలి, ఎంత సమయం కేటాయించాలో తెలుసుకోవాలి.
- జ్ఞాపకశక్తి అందరికి ఒకేవిధంగా ఉంటుంది. మనం ఎంత శ్రమిస్తే మన జ్ఞాపకశక్తి అంత మెరుగుపడుతుందని గ్రహించాలి.
- నేను పరీక్షలు సరిగ్గా రాయగలను అన్న ఆత్మవిశ్వాసంతో పరీక్షకేంద్రంలోకి వెళ్లాలి.
- అర్థంగాని విషయాలను (సబ్జెక్టు)ను టీచర్స్‌ లేదా మీ తోటి విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి.
- బద్దకం, సోమరితనం, అతినిద్ర మన దగ్గరకు రాకుండా ఉండాలంటే ఉదయం ఒక అరగంట యోగా, వ్యాయమం చేయడం మంచిది.
- ఎట్టిపరిస్థితిలోనూ ముఖ్యమైన పనులను, చదువును వాయిదా వేయకూడదు.
- భోజనం చేసిన తర్వాత నిద్ర రావడం సహజం. చదువుకునే సమయంలో నిద్ర వస్తే మీ తోటి స్నేహితులతో గ్రూప్‌ డిస్కర్షన్‌ చేయాలి.
- చదువుతున్నపుడు ప్రతి గంటకు ఒక పది నిమిషాలు విరామం తీసుకోండి. దీనివలన చదివిన విషయాలు ఎక్కువ రోజులు జ్ఞాపకం ఉంటాయి.
- సబ్జెక్టు అర్థంకాకపోతే వదిలి వేయకుండా సబ్జెక్టు టీచర్‌ను అడిగి నేర్చుకోవాలి. అవసరమయితే ఆ సబ్జెక్టులో అవగాహన ఉన్న మీ తోటి స్నేహితులతో అడిగి తెలుసుకోవాలి.
- పరీక్షలలో జవాబులు సొంతంగా రాయడానికి ప్రయత్నించండి. జవాబుల్లో మీదంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. అందరు రాసే గైడ్లోని, మాడల్‌పేపర్‌లోని జవాబులను చూసి బట్టి పట్టకూడదు.
- జవాబులు పాయింట్లు లాగా సక్రమంగా, సంపూర్ణంగా, అర్థవంతంగా ఉండాలి. వీలైతె ప్రతి జవాబుకు దయాగ్రామ్‌ వేయండి. రాసిన రాతలో పటుత్వం ఉండాలి. అనవసరమైన వ్యాఖ్యలు, పిచ్చిరాతలు లేకుండా, జవాబు స్పష్టంగా రాయాలి.
- చేతిరాతను అందంగా మెరుగు పరుచుకోవాలి. అంతే కాకుండా అవసరమయినంత వేగంగా రాయడానికి ప్రయత్నించాలి.
- పరీక్షలో కష్టమయిన ప్రశ్నలను కూడా వదలకుండా మీకు వచ్చినంత వరకు రాయడానికి ప్రయత్నించాలి, అంతేగాని ప్రయత్నాన్ని విరమించకూడదు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

సుభాష్‌నగర్‌: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌర సరఫరాల శాఖ, సివిల్‌ సప్లైస్‌ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ, చట్ట పరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు, వస్తు, సేవలలో మోసాలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి.. పలు అంశాలపై వినియోగదారులను చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహించాలని వినియోగదారుల సంఘాలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వస్తువుల నాణ్యత, వాటి ప్రమాణాల గుర్తింపు, తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన ఉన్నప్పుడే, నాసిరకం, నాణ్యతా లోపాలను గుర్తించి తమ హక్కులకు ఫిర్యాదు చేస్తారన్నారు. ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన వస్తువులు, సేవలను గుర్తించేందుకు గల అవకాశాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం ప్రతినిధి రాజేశ్వర్‌, అధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



గంజాయి విక్రేతను పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌ ఎన్జీవో కాలనీలో గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఎన్జీవో కాలనీకి వెళ్లారు. అక్కడ గంజాయి అమ్ముతున్న నిర్మల్‌ జిల్లా గాజుల నర్సాపూర్‌ గ్రామానికి చెందిన కోడె సంపత్‌ను పట్టుకున్నారు. అలాగే అతడి వద్ద నుంచి 230 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని నాందేడ్‌ నుంచి తీసుకుని వచ్చి నిజామాబాద్‌లో అమ్ముతున్నట్లు అతడు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.